క్లుప్తంగా

శివ మాలధారులకు శ్రీకృష్ణ కమిటీ ఆహ్వానం



కొత్తకోట: పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొనాలని శివ మాల ధారులు, చంద్రమౌళీశ్వర భక్త మార్కండేయ ఆలయంలోని శివ మాలధారులను ఆహ్వానించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి



ఖిల్లాఘనపురం: బీజేపీ మండల యువమోర్చా పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు మండల యువమోర్చా అధ్యక్షుడు కొరిగెల గోపి ముదిరాజ్ తెలిపారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు దాసర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ ఆదేశానుసారం కమిటీని నియమించారు. ప్రధాన కార్యదర్శిగా సిరుసాల సాయినాథ్, ఉపాధ్యక్షులుగా పాత్లావత్ హేమంత్‌రాథోడ్, సిద్దె వేణును ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆశన్న, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, నాయకులు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి



పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. బుధవారం మండలంలోని రేమద్దుల, అన్నారం, పాన్‌గల్ సబ్‌సెంటర్లను సందర్శించి వ్యాధి నిరోధక టీకాల పంపిణీపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలను వేయించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరిగి అంటు వ్యాధుల నుంచి పిల్లలు రక్షణ పొందుతారన్నారు. దీంతో పాటు గ్రామాల్లో నిర్వహిస్తున్న మధుమేహ(షుగర్) పరీక్షలను 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ చేయించుకొని వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు లారెన్స్, మైథిలీ, వైద్య సిబ్బంది శాంతమ్మ, రేవతి, నర్సమ్మ, నాగేశ్వరి, శాంత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'భగవద్గీత పఠనంతో జ్ఞానం సిద్ధిస్తుంది'



వనపర్తి రూరల్: విశ్వలోక కల్యాణం కోసం జగద్గురు శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధించారని, ఆయనే గుణాతీత గురువు అని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి వనపర్తి కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు అన్నారు. బుధవారం మండలంలోని అప్పాయిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. గురువు అనే పదానికి వచ్చిన మూల్యాంకాలను ఆయన వివరించారు. సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్మను జగద్గురువుగా భావించి పూజలు చేయాలని సూచించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల త్రైత సిద్ధాంత భగవద్గీతలో శ్రీకృష్ణుడి నిజం స్వరూపం పొందుపరిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు సురేష్‌కుమార్, బద్రీనాథ్, పద్మ, స్వరూప, శివమ్మ, అలివేలమ్మ, లలితమ్మ, చింటు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ: వ్యక్తికి గాయాలు

గోపాల్‌పేట: అతివేగంతో వచ్చిన ఓ కారు ద్విచక్రవాహన్ని ఢీకొట్టగా వ్యక్తి తీవ్ర గాయాల పాలైన ఘటన మండల కేంద్రానికి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గోపాల్‌పేట సమీపంలోని పెద్దబండ తండాకు చెందిన కాట్రావత్ అంజి స్థానికంగా ఉన్న సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్ కార్మికుడి (ఆపరేటర్)గా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఆరున్నర ప్రాంతంలో ఇంటి నుంచి బస్టాండు వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా అదే సమయంలో చీర్కపల్లికి చెందిన మహేష్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో మహాదేవునిపేటకు వెళ్తూ.. వెనక నుంచి అంజి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న అంజి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి అంజిని ఆటోలో వనపర్తి ఆస్పత్రికి తరలించారు.

'బోనస్'కు ఎదురుచూపులు

- వరి సన్నాలు విక్రయించి రెండు నెలలు దాటినా..
- మండలంలో 519 మందికి రూ.1.62 కోట్ల వరకు బకాయిలు



పాన్‌గల్‌లో సన్న ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు (ఫైల్)

పాన్‌గల్: మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం ధాన్యం విక్రయించిన రైతులు ప్రభుత్వం అందించే బోనస్ డబ్బుల కోసం ఎదురుచూడాల్సి దుస్థితి ఉంది. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో రైతులు ప్రైవేట్ వ్యక్తులకు కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని విక్రయించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన కొత్తలో ధాన్యం సేకరించిన వారంలోనే రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ చేసిన ప్రభుత్వం.. ఆ తర్వాత బోనస్ డబ్బుల చెల్లింపులో జాప్యం చేస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బోనస్ కోసం రైతులు సింగిల్ విండో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. అధికారులు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయితే రైతుల ఖాతాల్లోనే జమ అవుతాయని సమాధానం ఇస్తుండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

మండల పరిస్థితి..

మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో సింగిల్ విండో కార్యాలయం వారు 635 మంది రైతుల నుంచి 38,790 క్వింటాళ్ల సన్న ధాన్యం కొనుగోలు చేశారు. అందులో 116 మంది రైతులకు రూ.31.24 లక్షల వరకు బోనస్ చెల్లించినా.. 519 మంది రైతులకు సంబంధించి రూ.1.62 కోట్ల వరకు బోనస్ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై అధికారులను రైతులు నిలదీస్తే తమ చేతిలో ఏం లేదని, ప్రభుత్వం బోనస్ నిధులు విడుదల చేస్తే ఖాతాల్లో జమ చేస్తామని చెప్తున్నారని అన్నదాతలు వాపోయారు.

రెండు నెలలుగా..



రెండు నెలల క్రితం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో సన్న వడ్లను విక్రయించాను. 34 క్వింటాళ్ల ధాన్యానికి సంబంధించి బోనస్ డబ్బులు రావాల్సి ఉంది. సింగిల్ విండో కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉందని అధికారులు చేతులెత్తేశారు.

– కృష్ణయ్యగౌడ్, రైతు, దావాజిపల్లి

ప్రభుత్వం స్పందించాలి



గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో సన్న వడ్లను విక్రయించి రెండు నెలలు దాటినా నేటికీ బోనస్ డబ్బులు జమ కాకపోవడంతో యాసంగి పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నాం. 158 క్వింటాళ్లకు సంబంధించిన బోనస్ డబ్బులు జమ కాలేదు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయిస్తే బోనస్‌తో కలిపి అధికంగా డబ్బులు వస్తాయని ఆశించినం. అవసరానికి రావడం లేదు.

– నిరంజన్‌రెడ్డి, రైతు, జమ్మాపూర్

త్వరలోనే ఖాతాల్లో జమ



బోనస్ డబ్బులపై రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదు. పెండింగ్ నిధుల వివరాలను జిల్లా అధికారులకు నివేదించాం. రోజు కొందరికి చొప్పున రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ అవుతున్నాయి. మండలంలో రూ.1.62 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన రైతులందరికీ నాలుగైదు రోజుల్లో బోనస్ డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయి.

– భాస్కర్‌గౌడ్, సీఈఓ, పాన్‌గల్

వైభవంగా మార్కండేయస్వామి బిందెసేవ



మార్కండేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఖిల్లాఘనపురం: మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని భక్తమార్కండేయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో బుధవారం బిందె సేవ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. గ్రామంలోని దేవాలయం వద్ద నుంచి స్వామివారిని పల్లకీలో ఉంచి మహిళలు కళశాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. పద్మశాలి కల్యాణ మండపం వద్ద స్వామివారిని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్దకు స్వామివారిని తీసుకొచ్చి కళశాలలో తీసుకొచ్చిన నీటితో అభిషేకించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, భక్తులు స్వామి వారి ఊరేగింపులో భజన చేస్తు భక్తిగీతాలు ఆలపించారు.

'అర్హులందరికీ రుణమాఫీ చేయాలి'



కమాలోద్దీన్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు



అప్పారెడ్డిపల్లిలో..

ఖిల్లాఘనపురం: అర్హులైన ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్యతో పాటుగా గ్రామాల అధ్యక్షులు చెన్నయ్య, కృష్ణ, రైతులు డిమాండ్ చేశారు. రుణమాఫీ కాని రైతులతో కలిసి బుధవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు అర్హులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి 14 నెలలు కావస్తున్నా పూర్తి స్థాయిలో చేయలేదని ధ్వజమెత్తారు. మండలంలో సుమారు 12 వందల మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. అనంతరం రైతులు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయని ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్తామన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 24 క్యూసెక్కులు, రామన్‌పాడు ఎడమ, కుడి కాల్వ ద్వారా 117 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

ఎర్రవల్లి: గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతి నెల సక్రమంగా వేతనాలు చెల్లించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు హనుమంతు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై నాయకులతో కలిసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ కార్మికులకు జనవరి నుంచి ప్రతి నెల 5వ తేదీ లోపే వేతనాలు ఇస్తామని ప్రభుత్వం హామీ నేటికీ అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆదిదంపతులైన శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివపార్వతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా ఆడపడుచులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణానికి కొత్తకోట, కానాయపల్లి, పాలెం, నిర్వేన్ గ్రామాల భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న వడ్డె శ్రీనివాసులు దంపతులు

శ్రీదత్త కోటిలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కోసం కొత్తకోట తాజా మాజీ వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, మణెమ్మ దంపతులు తమ వంతుగా రూ.27,116 విరాళం ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

వ్యక్తి అదృశ్యం



రవి (ఫైల్)

గోపాల్‌పేట: మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల మండలంలోని దేవునిగుట్టతండాకు చెందిన కోరావత్ రవి దంపతులు ఇటుక బట్టీలో పని చేసుకునేందుకు గోపాల్‌పేటకు వచ్చారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న గోప్యానాయక్ ఇటుక బట్టీలో పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. కోరావత్ రవి మంగళవారం రాత్రి ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో రవి భార్య కోరావత్ శారద పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ (ఐఓ) రాజు తెలిపారు.

'పాత సీసాలో కొత్త సారా'ల ఐటీ టవర్ జీవో !

వనపర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం వనపర్తి జిల్లాకు మంజూరు చేసిన ఐటీ టవర్ జీఓ గ్రామీణ ప్రాంతాల్లో తరచూ ఉపయోగించే 'పాత సీసాలో కొత్త సారా' అన్న సామెతను గుర్తుకు చేస్తోంది. 2023 సెప్టెంబర్ 29వ తేదీన జిల్లా కేంద్రంలోని నాగవరం శివారులో అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జిల్లాలో ఐటీ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన సైతం చేశారు. అదే సర్వే నెంబర్.. అదే ప్రాంతంలో ఐటీ టవర్ నిర్మించేందుకు.. గతంలో మంజూరు చేసిన రూ.22 కోట్ల బడ్జెట్‌తోనే రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అభ్యర్థనల మేరకు ఐటీ టవర్ నిర్మాణానికి మంజూరు ఇస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయడం విడ్డూరంగా ఉందనే చర్చ స్థానికంగా సర్వత్రా వినిపిస్తోంది. తాజాగా ప్రభుత్వం మంజూరు చేసిన ఐటీ టవర్ విషయమై.. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే వేర్వేరుగా సీఎం రేవంత్‌రెడ్డికి కతజ్ఞతలు చెప్పడం గమనార్హం.

రంగరాజన్‌పై దాడి అమానుషం



ఆత్మకూర్/పెబ్బేరు: చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య అని, దుండగులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ధూప దీప అర్చక సంఘం, బ్రాహ్మణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆత్మకూర్, పెబ్బేరు అర్చకులు రంగరాజన్‌ను కలిసి పరామర్శించారు. అర్చకులపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మీకాంతాచార్యులు, ప్రధానకార్యదర్శి శ్రీధర్‌జ్యోషి, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బాలింగయ్య, ప్రభాకర్‌రావు, వెంకట నర్సింహారావు, భీంసేన్‌జ్యోషి, గుండాచారి, రాఘవేంద్రరావు, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల

పాన్‌గల్: జిల్లా, మండల పరిషత్ ఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీ ఎన్నికలు కూడా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఓటర్ల జాబితాను ప్రకటించారు. మరో వైపు ఎన్నికల నిర్వహణకు సంబంధించి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించే అధికారులకు శిక్షణను ప్రారంభించారు. ఈనెల 13న రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ తేదీ ప్రకటించడమే తరువాయి అన్నట్లుగా అధికారులు పనిచేస్తున్నారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 256 వార్డులు, 14 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 42,182 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 21,394, స్త్రీలు 20,787, ఇతరులు ఒకరు ఉన్నారు. మండలంలో మొత్తం 73 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పోలింగ్ బూతులపై 13వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితాను ఈనెల 15న ప్రకటిస్తామని ఎంపీడీఓ గోవింద్‌రావు తెలిపారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

పాన్‌గల్: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్పీ గోవింద్ తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో బడిబయట ఉన్న 9వ తరగతి విద్యార్థి సమీర్‌ద్దీన్ గుర్తించి వారి తల్లి దండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపించాలని కోరారు. చదువుకుంటే కలిగే లాభాలు, చదువు ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించారు. బడి మధ్యలో మానేసిన విద్యార్థిని రెండు రోజులల్లో బడికి పంపిస్తామని తల్లిదండ్రులు ఒప్పుకున్నట్లు సీఆర్పీ పేర్కొన్నారు.

బీటీగా మారేదెన్నడో?



అమరచింత నుంచి మూలమళ్లకు వెళ్లే మట్టి రహదారి

అమరచింత: పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహం నుంచి మూలమళ్ల గ్రామం వరకు ఉన్న కచ్చ రహదారిని బీటీగా మార్చాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం దక్కడం లేదని స్థానికులు వాపోతున్నారు. సుమారు ఐదున్నర కిలోమీటర్ల మట్టి రహదారికి బీటీ కోసం ప్రభుత్వం పలు దఫాలుగా నిధులు మంజూరు చేయడం, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిధులు సరిపోవని వెనక్కి వెళ్లడంతో పనులు మరుగునపడ్డాయి. ఇరు గ్రామాల ప్రజలతో పాటు రైతులకు ఉపయోగపడే రహదారి కావడంతో వేగంగా పనులు చేపట్టాలని రైతులు సంబంధిత అధికారులు, ఎమ్మెల్యేకు వేడుకుంటున్నారు. అమరచింత ఎత్తిపోథల పథకం ఆయకట్టు అధిక భాగం ఇరు గ్రామాల మధ్య ఉండటంతో ఎత్తిపోథల సంఘం డైరెక్టర్లు, రైతులు రహదారిని సీసీగా మార్చమంటూ పీజేపీ అధికారులకు గతంతో విన్నవించారు. రైతుల విన్నపానికి స్పందించిన ఇరిగేషన్ శాఖ అధికారులు రహదారి పరిశీలించి పరిస్థితులను అంచనా వేశారు. వీటి కోసం సీసీ రహదారి నిర్మించాలని నిధులు మంజూరు చేశారు. కానీ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నేటికీ పనులు మొదలుపెట్టలేదని రైతులు మండిపడుతున్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరేందర్

అమరచింత: సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామాల్లో జరిగే నేరాలను నియంత్రించే అవకాశం ఉందని ఎస్ఐ సురేష్ తెలిపారు. సీసీ కెమెరాల అవశ్యకతపై మండలంలోని నందిమళ్ల గ్రామంలో బుధవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తున్నామన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే ప్రజలు స్వచ్ఛందంగా డబ్బులు పోగు చేసి కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నందిమళ్ల గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఇంటింటికీ వెళ్లి తమకు తోచిన విధంగా విరాళాల రూపంలో నగదు సేకరిస్తామని గ్రామస్తులు ఎస్ఐకి తెలిపారు. అదేవిధంగా ఆలయంతో పాటు ప్రార్థన మందిరాలకు సెంట్రల్‌లాకింగ్ సిస్టమ్ గల యూనివర్సల్ తాళాలు అమర్చాలని ఎస్ఐ సూచించారు.

కంటి సమస్యలున్న విద్యార్థులకు అద్దాల పంపిణీ



విద్యార్థులకు అద్దాలు అందిస్తున్న వైద్యులు

ఖిల్లాఘనపురం: విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ద్వారా అందిస్తున్న కంటి అద్దాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రీయ బాల స్వస్తీయ డాక్టర్ రఘు అన్నారు. బుధవారం మండలంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ఎంహెచ్‌టీ-4 కార్యక్రమంలో భాగంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖిల్లాఘనపురం, కమాలోద్దీన్‌పూర్, కడుకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 9, 10 తరగతులు, ఇంటర్ చదువుతున్న 3వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా.. కంటి సమస్యలు ఉన్న 210 మందికి ఈ పథకం ద్వారా కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నామన్నారు. అందుకోసం కలెక్టర్ ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ఎంతో మంది పేద విద్యార్థులకు అద్దాలు ఉచితంగా ఇవ్వడంతో మేలు కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నరేష్, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, కురుమూర్తి, వైద్య సిబ్బంది శ్రీవిద్య, లక్ష్మి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాస్‌లైన్ పార్టీ నాయకులు

అమరచింత: పట్టణంలో దోమల బెడద పెరిగిందని, వాటి నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ మండల కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున ఉన్న చెరువు పెద్ద కాల్వను మురుగుకాల్వగా మార్చడంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు వార్డుల వారీగా ఫాగింగ్ చేపట్టకపోవడంతో ప్రజలు విష జ్వారాల బారిన పడుతున్నారన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం పట్టణంలో చాలా మంది నిరుపేదలకు నేటికీ గ్యాస్ సబ్సిడీ పడట్లేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పట్టణంలో దోమల నివారణ కోసం ఫాగింగ్‌తో పాటు మురుగుకాల్వల శుభ్రత కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సామేలు, కురుమన్న, భక్తి తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిపై చర్చకు మేము సిద్ధం'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖిల్లాఘనపురం: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో మండలంలో చేసిన అభివృద్ధి, కాంగ్రెస్ 14 నెలల్లో చేసిన అభివృద్ధిపై చర్చించేందుకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఎందుకని, గ్రామాల్లో ప్రశ్నిస్తున్న ప్రజలు చాలని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి అభివృద్ధిపై చర్చకు మాజీ మంత్రి సిద్ధమా అని విలేకర్ల సమావేశంలో చేసిన సవాల్‌ను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 నెలల కాంగ్రెస్ పాలనలో మీరు ఏమి అభివృద్ధి చేశారని సవాళ్లు విసురుతున్నారని ప్రశ్నించారు. రుణమాఫీ వంద శాతం కాలేదని, రైతు భరోసా ఎప్పుడు పడతాయని, పింఛన్ల పెంపు లేదని, మహిళలకు రూ.2,500 ఇస్తామన్నా హామీలు ఏమయ్యాయని ఎద్దేవా చేశారు. గణపసముద్రం చెరువును రిజర్వాయర్ చేయొద్దని నినాదాలు చేయించడంతో పాటుగా రిజర్వాయర్ అయితే ఎకరాకు రూ.25 లక్షల పరిహారం ఇస్తామన్న ఎమ్మెల్యే దానికి కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు క్యామ వెంకటేష్, చిన్న అంజనేయులుగౌడు, గోపాల్, మన్యంగౌడు, కృష్ణ, కృష్ణానాయక్, రాంచంద్రి, ప్రతాప్ లు పాల్గొన్నారు.

భక్తి ఉద్యమ మార్గదర్శి సంత్ రవిదాస్

వనపర్తి టౌన్: సమ సమాజ నిర్మాణం కోసం, దేశంలో కులమత వివక్ష లేకుండా మనుషులందరూ సమానమేనని భక్తి ఉద్యమాన్ని నడిపించిన మహోన్నతుడు సంత్ రవిదాస్ మహారాజ్ అని మహనీయులు స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్, ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాష్ అన్నారు. బహుజన ప్రవక్త సంత్ రవిదాస్ మహారాజ్ 648వ జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో భూరోజు గిరిరాజాచారి, నాయకంటి నర్సింహాశర్మ, గంధ నాగరాజు, బాలేమియా, రాధాకృష్ణ, వెంకటేష్, తిరుపతయ్య, మద్దిలేటి, జగపతిరావు, యేసయ్య, పానుగంటి రాములు, రమేష్ తదితరులు ఉన్నారు.

నిలిచిపోనున్న 1962 పశు సంచార వాహన సేవలు



కొత్తకోట రూరల్: కొన్ని నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్న 1962 సిబ్బంది సమ్మె బాట పట్టనున్నారు. ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం14 పశు వైద్య సంచార వాహనాలు ఉన్నాయి. వనపర్తి నియోజకవర్గానికి ఒక 1962 పశు సంచార వాహనం ఉంది. అందులో పనిచేసే సిబ్బందికి జీతాలను చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ రోజురోజుకు భారంగా మారుతుందని సిబ్బంది వాపోతున్నారు. ప్రజా ప్రభుత్వంలోనైనా తమ బతుకులు మారుతాయని ఆశలు పెట్టుకున్న సిబ్బందికి నిరాశ మిగిలిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే నిధులను విడుదల చేసి తమకు సకాలంలో వేతనాలు అందించాలని 1962 సిబ్బంది ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.